
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
మంగళవారం 20 ఆగస్టు 2024



• రక్షగా..

జిల్లావ్యాప్తంగా సోమవారం రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. అన్నాచెల్లులు, అక్కాతమ్ముడు అనుబంధాన్ని తెలియజేస్తూ రాఖీ పౌర్ణమిని నిర్వహించుకున్నారు. స్కూళ్లలోనూ వేడుకలు వైభవంగా జరిగాయి. చిన్నారి చెల్లెళ్లతో అన్నయ్యలకు రాఖీ కట్టించి పండుగలోని అంతరార్థాన్ని వివరించారు. పామర్రులోని ఓ స్కూల్లో విద్యార్థుల మధ్య సోదరభావాన్ని పెంపొందిస్తూ ఇలా రాఖీలు కట్టించారు.





• వినతుల వెల్లువ

మచిలీపట్నంలోని టీడీపీ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు మంత్రి కొల్లు రవీంద్రకు ప్రత్యక్షంగా తమ సమస్యలను చెప్పుకొని వినతిపత్రాలు అందజేశారు.

6లో..

తప్పులతడక

వైసీపీ హయాంలో మోపిదేవి మండలంలో అక్రమాలు

- సామాజిక తనిఖీల్లో బయటపడిన నిజాలు
- పదుల సంఖ్యలో అనర్హులకు దివ్యాంగ పెన్షన్లు
- తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో చక్రంతిప్పిన వైసీపీ నేత
- గృహ నిర్మాణంలోనూ భారీ అవకతవకలు
- ఇంకుడు గుంతల నిధులు ఓ వలంటీర్ ఖాతాలోకి..
- గ్రామగ్రామాన అక్రమాలతో విస్తుపోయిన తనిఖీ బృందం

అర్హత లేకుండా, తప్పుడు ధ్రువపత్రాలతో దివ్యాంగ పింఛన్లు పొందుతున్నవారు కొందరైతే, గృహ నిర్మాణం పేరుచెప్పి అయినకాడికి దండుకున్న వారు ఇంకొందరు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మోపిదేవి మండలంలో హౌసింగ్, రెవెన్యూ శాఖల్లో సాగిన పలు అక్రమాలు సోమవారం నిర్వహించిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ సామాజిక తనిఖీల్లో వెలుగుచూశాయి. ఒక్క మోపిదేవి మండలంలోనే 106 మందికిపైగా తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో పింఛన్లు పొందుతున్న విషయం బయటపడగా, ఇంకుడుగుంతల పేరుతో భారీగా నిధులు పక్కదారి పట్టిన విషయం నిర్ధారణైంది. వీటన్నింటిపై విచారణ నిర్వహించాల్సిందిగా తనిఖీ బృందం డీసీహెచ్ఎస్‌కు సిఫారసు చేసింది.

- అవనిగడ్డ/మోపిదేవి



మోపిదేవిలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

హౌసింగ్‌లో గోల్‌మాల్

గృహ నిర్మాణంలో భాగంగా ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా నిర్మాణం చేపట్టే ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు తవ్వడానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ రూ.6 వేలు కేటాయించింది. కూలీ నిమిత్తం రూ.500, మెటీరియల్ కాంపొనెంట్ కింద రూ.5,500 ఇచ్చారు. మొత్తం 42 చోట్ల ఇంకుడు గుంతలు తవ్వకుండా తవ్వినట్టుగా ఎం.బుక్ రికార్డు చేసి ఆ మొత్తాన్ని హౌసింగ్ శాఖలో కాంట్రాక్టర్‌గా చెలామణి అవుతున్న ఓ మహిళ ఖాతాకు బదిలీ చేశారు. సదరు మహిళ గత వైసీపీ ప్రభుత్వంలో వలంటీర్‌గా పనిచేయటం గమనార్హం. లేవుట్-4లో పట్టాలిచ్చిన వారికి లే అవుట్-3లో ఇల్లు నిర్మించారని సామాజిక తనిఖీలో తేటతెల్లం కాగా, లే అవుట్-4లో కేటాయించిన సదరు ప్లాట్లు ఎవరికి కేటాయించారో తెలియటం లేదని ఈ తనిఖీలో తేలింది.

అడ్డగోలుగా పింఛన్ల మంజూరు

గడిచిన వైసీపీ పాలనలో మోపిదేవి మండలంలో సామాజిక పింఛన్ల పంపిణీలో అరాచకం రాజ్యమేలింది. అస్మదీయులకు లబ్ధి చేకూర్చేలా వైసీపీ నాయకులు చేసిన ప్రయత్నాలు సోమవారం నాటి సామాజిక తనిఖీలో బయటపడ్డాయి. రూ.45 వేల లంచం తీసుకుని, అందులో కొంతభాగాన్ని డీసీహెచ్ఎస్‌లో చెల్లించాల్సి ఉందని చెప్పి, దివ్యాంగులుగా ధ్రువీకరణ పత్రాలు సృష్టించి ప్రభుత్వ సొమ్మును పింఛన్ రూపంలో కట్టబెట్టారని తేలింది. తప్పుడు సర్టిఫికెట్లతో 106 మంది పింఛన్లు పొందుతున్నట్లు ప్రజా వేదిక కార్యక్రమంలో అధికారులే వెల్లడించి, నివేదిక సమర్పించారు. మోపిదేవి మండల పరిధిలోని పెదకళ్లేపల్లి గ్రామంలో దాదాపు 52 మందికి శారీరక లోపాలు ఉన్నాయని సర్టిఫికెట్లు సృష్టించి పింఛన్లు ఇస్తుండగా, వారిలో దాదాపు 40 మందికి వినికిడిలోపం ఉన్నట్టు ధ్రువీకరణ పత్రం పొందడం గమనార్హం. అలాగే, మోపిదేవి మండల పరిధి లోని కె.కొత్తపాలెం గ్రామంలో ఇలాంటి వారిని 15 మందిని గుర్తించారు. మరో 45 మంది గ్రామాల్లో అందుబాటులో లేకుండాపోయారు. తనిఖీల్లో ఎవరినైతే అనర్హులుగా గుర్తించారో వారి వివరాలను ఎంపీడీవో కార్యాలయానికి అందజేశారు. మోపిదేవితో పాటు కోసూరువారిపాలెం, కొక్కిలిగడ్డ, పెదప్రోలు గ్రామాల్లో వినికిడిలోప ధ్రువీకరణ పత్రాలతో పింఛన్లు పొందుతున్న విషయం వెలుగుచూసింది. ఈ మొత్తం వ్యవహారం వెనుక మోపిదేవి మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయిన నాయకుడు, పలువురు గ్రామస్థాయి నేతలు చక్రం తిప్పారని తెలుస్తోంది.

అక్రమాలు బయటపడిన మాట వాస్తవమే..

మోపిదేవి మండలంలో పలువురు తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో పింఛన్లు పొందుతున్నట్టుగా నిరూపితమైన విషయం వాస్తవమే. దాదాపు 106 మంది అనర్హులు పింఛన్లు పొందుతున్నట్టుగా తేలింది. వారిలో 10 మంది చిరుద్యోగులకు రూ.10 వేలలోపు వేతనం ఉంది. మిగతా 96 మంది అనర్హులు పింఛన్లు పొందుతున్నట్లు వెల్లడైంది. అనర్హులుగా పింఛన్లు పొందుతున్న వారిపై చర్యల కోసం ఎంపీడీవోకు నివేదిక ఇచ్చాం. - రవిబాబు, ఏపీ

ఇంకుడు గుంతల అవకతవకలపై ఫిర్యాదులు

మోపిదేవి మండలంలో గృహ నిర్మాణం చేపట్టిన ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు తవ్వడానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ విడుదల చేసిన నిధులు పక్కదారి పట్టినట్టు తనిఖీల్లో తేలింది. చర్యల నిమిత్తం ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం. నగదు రికవరీకి ఆదేశాలు జారీ చేశాం.

- నాంచారావు, ఏపీడీ, డీఎల్‌డీవో

కిడ్నీ వ్యాధితో మరొకరు మృతి

ఒక్కరోజులో రెండో మరణం

- ఎ.కొండూరు తండాలో భయాందోళన



జరబల దుర్గ (ఫైల్)

ఎ.కొండూరు, ఆగస్టు 19 : ఎ.కొండూరు మండలంలోని గిరిజన తండాలో కిడ్నీ వ్యాధి భయాందోళన కలిగిస్తోంది. చైతన్యనగర్ తండాకు చెందిన పగడమ్మ ఆదివారం మృతిచెందగా, చీమలపాడు శివారు పెద్దతండాకు చెందిన జరబల దుర్గ (60) సోమవారం మృతిచెందింది. ఒక్కరోజు వ్యవధిలో రెండు మరణాలు సంభవించడంతో గిరిజనులు భయాందోళన చెందుతున్నారు. దుర్గ కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. సిరం క్రియాటీన్ శాతం పెరగడంతో విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఇటీవల క్రియాటీన్ శాతం పెరగడంతో వైద్యులు డయాలసిస్ చేయించుకోవాలని సూచించారు. భయంతో ఆమె చేయించుకోలేదు. ఒక్కసారిగా వ్యాధి తీవ్రత పెరిగి సోమవారం ఇంటి వద్ద మృతిచెందింది. మృతురాలి బంధువులను సీపీఎం నేతలు ఆనందరావు, వెంకటేశ్వరరావు పరామర్శించి.. ఎక్స్‌గ్రేషియా, మట్టి ఖర్చులకు డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేశారు.


పిడుగుపాటుకు ఇద్దరు మృతి

ఎన్టీఆర్ జిల్లాలో వేర్వేరు చోట్ల ఘటనలు

వీరులపాడు/పెనుగొలను(గంపలగూడెం), ఆగస్టు 19 : ఎన్టీఆర్ జిల్లాలో పిడుగు పడి వేర్వేరు చోట్ల ఇద్దరు మృతిచెందారు. వీరులపాడు మండలం దొడ్డదేవరపాడు గ్రామానికి చెందిన చింతరాల వెంకట రమణ (17) సోమవారం పొలం పనుల నిమిత్తం వరినాట్లు వేయడానికి వెళ్లాడు. వర్షంతో పాటు పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. చేతికందిన కుమారుడు మృతి చెందడంతో ఆ తల్లిదండ్రులు గుండెలవిసేలా ఏడ్చారు. అలాగే, పిడుగుపడి గంపలగూడెం మండలం పెనుగొలను గ్రామానికి చెందిన బొలగాని వెంకటేశ్వరరావు (26) మృతిచెందాడు. కౌలుకు తీసుకున్న పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా, ఆకస్మికంగా వర్షం కురిసింది. దీంతో వెంకటేశ్వరరావు పక్కనే ఉన్న చెట్టు కిందకు వెళ్లి నిలబడ్డాడు. ఉరుములు మెరుపులకు వెంకటేశ్వరరావు నిలబడిన చెట్టుపై పిడుగు పడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని టీడీపీ నాయకులు నాగళ్ల మురళి, నంబూరి శ్రీనివాసరావు సందర్శించి నివాళులర్పించారు.

అటు నుంచి ఇటూ..

నాడు వైసీపీతో అంటకాగిన గుడివాడలోని అధికారులు



- కొడాలి నాని అనుచరులు, వారి అరాచకాలకు ఊతం
- నేడు టీడీపీ కూటమి నాయకుల చుట్టూ ప్రదక్షిణలు
- కాసులు కురిపించే సీట్లను కాపాడుకునే యత్నాలు
- దశాబ్దాలుగా కదలని కొందరు అధికారులు

ప్రస్తుతం టీడీపీ కార్యాలయం వైపు ఉరుకులు పరుగులు

అనుకున్నదొక్కటి.. అయ్యిందొక్కటి.. గుడివాడలో కీలక శాఖల్లో పనిచేస్తున్న అధికారుల ప్రస్తుత పరిస్థితి ఇది. వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులతో అంటకాగి, అరాచకాలకు ఊతమిచ్చిన ఎందరో అధికారులు ఇప్పుడు దిక్కుతోచని స్థితిలో దిక్కులు చూస్తున్నారు. ఊసరవెల్లి కంటే ఘోరంగా రంగులు మారుస్తూ ప్రస్తుతం టీడీపీ కూటమి నాయకుల పంచన చేరుతున్నారు. సీట్లను కాపాడుకోవడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.

గుడివాడ : షాడో మంత్రిగా పేరొందిన మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని ముఖ్య అనుచరుడు దుక్కిపాటి శశిభూషణ్ మాటే వేదంగా గుడివాడలోని కొన్ని శాఖల అధికారులు తలలూపారు. ముఖ్యంగా గుడివాడ మున్సిపల్, విలీన గ్రామాల్లో పనిచేసిన అధికారులు, ప్రత్యేక అధికారులు తమ పరిధికి మించి టీడీపీ నాయకులపై ఓవరాక్షన్ చేశారు. శశి తమ అన్నయ్య అంటూ అంటకాగారు. వైసీపీ నాయకులు చేసిన దోపిడీకి సహకరించారు. ఇప్పుడు వైసీపీకి అధికారం పోవడంతో ప్లేటు ఫిరాయించారు. శశి సాన్నిహిత్యంతో ఆయా ప్రభుత్వ శాఖల్లోని నిధులను పక్కదారి పట్టించిన వారంతా నేడు టీడీపీ నాయకుల ఇళ్ల చుట్టూ తిరుగుతున్నారు. నాయకులతో వరసలు కలుపుతూ మరోమారు తిష్ట వేసేందుకు ప్రయత్నిస్తున్నారు. కొందరు అధికారులైతే.. ఆయా గ్రామాలు, వార్డుల్లోని కూటమి నాయకుల్లో జరుగుతున్న ఆధిపత్య పోరులో మరింత అగ్గి రాజేసి వారిలో వారికే గొడవలు సృష్టిస్తున్నారు.

ఏళ్ల తరబడి ఇక్కడే..

కొన్ని ప్రభుత్వ శాఖల్లోని అధికారులైతే గుడివాడను వదిలేందుకు అస్సలు ఇష్టపడట్లేదు. గత వైసీపీ ప్రభుత్వంలో కొన్ని పోస్టింగ్‌లు పడకుండా కేవలం ఇన్‌చార్జులుగా వ్యవహరించారు. తాజా బదిలీల్లో మళ్లీ తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయా శాఖల్లో ఖాళీలను చూపి, తిరిగి ఇన్‌చార్జులుగా వ్యవహరించిన పోస్టుల్లోకి వచ్చేయాలనేది వారి పన్నాగం. ముఖ్యంగా ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలో మాజీ ఎమ్మెల్యే కొడాలి నానీకి అత్యంత సన్నిహితంగా వ్యవహరించిన వారు పదుల సంఖ్యలో ఉన్నారు. ఎనిమిదేళ్లకు మించి ఇక్కడే పనిచేస్తున్నప్పటికీ మరో ఐదేళ్లు తిష్ట వేయాలని చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొందరు ప్రభుత్వ అధికారులు సెలవుపై వెళ్లారు. వీరిలో అత్యధికులు వైసీపీ నాయకులతో అంటకాగినవారే. తిరిగి వీరే టీడీపీ నాయకుల కోసం ప్రదక్షిణలు చేస్తున్నారు. వీరిలో కొందరు ఊసరవెల్లి కంటే దారుణంగా రంగులు మారుస్తూ టీడీపీ నాయకులను ఏమార్చే ప్రయత్నాల్లో ఉన్నారు.

వివిధ శాఖల్లో అత్యధికులు

గత వైసీపీ ప్రభుత్వంలో అధికార పార్టీ నాయకులకు తొత్తులుగా వ్యవహరించిన వారు అత్యధిక సంఖ్యలోనే ఉన్నారు. మున్సిపల్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, విద్యుత్, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ శాఖల్లో కొందరు నేటికీ వైసీపీతో అంటకాగుతున్నారు. ఆ పార్టీ నాయకులకు సమాచారాన్ని చేరవేస్తున్నారు.

టీడీపీ నాయకుల గగ్గోలు

బదిలీల ప్రక్రియ ప్రారంభం కాకముందే టీడీపీ నాయకులు గగ్గోలు పెడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో, ఇతరత్రా సందర్భాల్లో తమను ఇబ్బందులకు గురిచేసిన అధికారులు ఇక్కడికి వచ్చేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరిలో కొందరికి స్థానిక టీడీపీ నాయకులు అండగా ఉంటున్నారని ఆరోపిస్తున్నారు. వైసీపీ నాయకులు సాగించిన అవినీతి, అరాచక, దోపిడీకి సహకరించిన వారికి స్థానిక నాయకులు తెలిసి ఎలా సిఫారసు లేఖలు ఇస్తారని ప్రశ్నిస్తున్నారు.

జిల్లాలో టీచర్ల సర్దుబాటు ప్రక్రియ దాదాపు నిలిచిపోయింది. ఈ విషయంపై విద్యాశాఖ ఉన్నతాధికారులు రోజుకో రకంగా ఉత్తర్వులు జారీ చేయడంతో తప్పులతడకగా ఉన్న జాబితాల ఆధారంగా తాము కౌన్సెలింగ్‌లో పాల్గొనబోమని టీచర్లు భీష్మించారు. ఉపాధ్యాయ సంఘాల నాయకుల సూచనతో కౌన్సెలింగ్‌కు హాజరుకావడం లేదని లేఖలు ఇచ్చి పక్కకు తప్పుకొన్నారు. దీంతో జిల్లాలో సెకండరీ గ్రేడ్ టీచర్ల (ఎస్‌జీటీ) సర్దుబాటు కౌన్సెలింగ్ నిలిచిపోగా, కొద్దిమంది స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించిన కౌన్సెలింగ్‌ను మాత్రం సోమవారం మమ.. అనిపించారు.

సర్దుబాటుకు బ్రేక్



కౌన్సెలింగ్‌ను బహిష్కరించిన ఉపాధ్యాయులు

- విద్యాశాఖ ఉత్తర్వుల్లో గందరగోళమే కారణం
- కౌన్సెలింగ్‌కు వచ్చేది లేదని భీష్మించిన టీచర్లు
- నిబంధనల మేరకే చేయాలన్న డీఈవో
- జిల్లాలో మిగులుగా ఉన్నవారు 654 మంది
- 545 మందిని సర్దుబాటు చేసే అవకాశం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో టీచర్ల సర్దుబాటు ప్రక్రియకు సంబంధించి ఇటీవల ఉపాధ్యాయ సంఘాల నాయకులతో విద్యాశాఖ ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. ఆ సమయంలో టీచర్ల పుట్టిన తేదీని ప్రామాణికంగా తీసుకుని సర్దుబాటు చేసేందుకు అంగీకరించారు. కాగా, ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో సర్దుబాటు విధివిధానాలతో కూడిన ఉత్తర్వులను విడుదల చేశారు. అలాగే, సోమవారం ఉదయం 10 గంటలకు విడుదల చేసిన ఉత్తర్వుల్లో డీఎస్సీ ర్యాంకును బట్టి సర్దుబాటు చేస్తామని స్పష్టం చేశారు. దీంతో ఈ వ్యవహారంలో గందరగోళం ఏర్పడింది. పుట్టిన తేదీని బట్టి సీనియారిటీని గుర్తించాలని టీచర్లు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎంఈవోలు, డీవైఈవోలతో చర్చలు జరిపారు. కానీ, విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాలను పూర్తిగా చదివి, అందుకు అనుగుణంగానే టీచర్ల సర్దుబాటు ప్రక్రియను చేపట్టాలని డీఈవో తాహెరాసుల్తానా ఎంఈవోలు, డీవైఈవోలకు టెలీకాన్ఫరెన్స్ ద్వారా సూచించారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులతో వాగ్వాదాలకు దిగకుండా నిబంధనల ప్రకారమే చేయాలన్నారు. ఇదిలా ఉండగానే, సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు సర్దుబాటు ప్రక్రియ ప్రారంభమవుతుందని, అది కూడా ఆన్‌లైన్‌లో ఉంటుందని, తమ చేతుల్లో ఏమీ లేదని, జాబితాల్లో పేర్లు ఉన్న టీచర్లంతా కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ఎంఈవోలు, డీవైఈవోలు తేల్చిచెప్పారు.

నిబంధనలు మార్చాలని లేఖలు ఇచ్చి..

ఇటీవల ఫ్యాప్టో నాయకులతో విద్యాశాఖ ఉన్నతాధికారులు నిర్వహించిన సమావేశంలో టీచర్ల పుట్టిన తేదీ ఆధారంగా సర్దుబాటు ప్రక్రియను చేపడతామని హామీ ఇచ్చారని, అదే పద్ధతిలో సర్దుబాటు చేయాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. అయితే, ఎంఈవోలు, డీవైఈవోలు ఇందుకు అంగీకరించలేదు. దీంతో ఇతర జిల్లాల్లో ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటున్నారనే అంశంపై జిల్లాకు చెందిన ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆరా తీశారు. శ్రీకాకుళం జిల్లాలో కౌన్సెలింగ్‌ను బహిష్కరించారని తెలుసుకున్నారు. మన జిల్లాలోనూ అదే బాట పట్టారు. కృత్తివెన్ను, మొవ్వ, ఘంటసాల, పామర్రు తదితర మండలాల్లోని టీచర్లు లేఖలు ఇచ్చి కౌన్సెలింగ్ నుంచి వెనక్కి వచ్చేశారు. అలాగే, పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను ఆగస్టు 16 నాటికి పరిగణనలోకి తీసుకుంటామని గతంలో హామీ ఇచ్చారని, సోమవారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో మాత్రం ఆగస్టు 9 వరకేనని పేర్కొన్నారని, కౌన్సెలింగ్‌ను బహిష్కరించడానికి ఇది కూడా ఒక కారణమని ఎంఈవోలు, డీవైఈవోలకు ఇచ్చిన లేఖల్లో ఉపాధ్యాయ సంఘాల నాయకులు పేర్కొన్నారు.

జిల్లాలో 654 మంది టీచర్లు మిగులుబాటు

జిల్లాలో వివిధ సబ్జెక్టులకు సంబంధించి స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్‌జీటీలు) కలిపి 654 మంది మిగులుబాటుగా ఉన్నారని పాఠశాల విద్యా కమిషనర్ కార్యాలయం విడుదల చేసిన జాబితాల్లో చూపినట్లు డీఈవో కార్యాలయ అధికారులు తెలిపారు. 654 మంది టీచర్లలో 545 మందిని సర్దుబాటు చేసేందుకు అవకాశం ఉందని, తొలుత మండల స్థాయిలో, అనంతరం డివిజన్ స్థాయిలో చేయాల్సి ఉందన్నారు. మండల స్థాయిలో రెండు రోజుల పాటు, డివిజన్ స్థాయిలో ఒకరోజు ఈ ప్రక్రియ జరుగుతుందని డీఈవో కార్యాలయ అధికారులు చెబుతున్నారు. ఇంకా మిగులుబాటుగా ఉన్న టీచర్లను ఎలా సర్దుతారనే అంశంపై డీఈవో ద్వారా ఆర్‌జేడీకి వివరాలు పంపుతామని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎస్‌జీటీలకు సంబంధించిన సర్దుబాటు ప్రక్రియ నిలిచిపోగా, ఉన్నత పాఠశాలల్లో ఖాళీలను బట్టి డీవైఈవోలు కొంతమంది స్కూల్ అసిస్టెంట్లను సోమవారం సర్దుబాటు చేశారని, మిగిలిన వారి విషయంపై విద్యాశాఖ ఉన్నతాధికారుల సూచనల మేరకు నడుచుకుంటామని పేర్కొంటున్నారు.



బొర్రపోతుపాలెంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, ఏఎన్‌ఎంలు

బొర్రపోతుపాలెంలో డెంగ్యూ విజృంభణ

• ఒకరు మృతి



మృతుడు శివన్నారాయణ (ఫైల్)

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 19 : బందరు మండలం బొర్రపోతుపాలెంలో డెంగ్యూ జ్వరం విజృంభిస్తోంది. గ్రామంలో 50 శాతం ప్రజలు మంచాన పడ్డారు. 1,500 జనాభా కలిగిన గ్రామంలో దాదాపు 600 మంది జ్వరాలతో బాధపడుతున్నారు. జ్వరంతో బాధపడుతూ చండిక శివన్నారాయణ (55) మృతిచెందారు. కాగా, గ్రామంలో సమస్యను స్థానిక టీడీపీ నాయకులు కాగిత సాంబశివరావు, గోపు సత్యనారాయణ తదితరులు మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇంటింటికీ తిరిగి రక్తం సేకరించి పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జి.గీతాబాయి ఇంటింటికీ తిరిగి సర్వే చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఏఎన్‌ఎంలు ఇంటింటి సర్వే చేస్తున్నారు. సర్పంచ్ గట్టే సుశీలామణి సోమవారం వైద్యులు, ఏఎన్‌ఎంలతో కలిసి పర్యటించారు. తాళ్లపాలెం పీహెచ్‌సీ వైద్యులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. జ్వరాలకు గురైన రోగులకు మందులు పంపిణీ చేశారు. కుళాయిల్లో తాగునీటి పరీక్షలు జరిపారు. బావుల్లోని నీటిని వాడొద్దని హెచ్చరించారు.

కన్నులపండువగా గిరిప్రదక్షిణ

కిక్కిరిసిన ఇంద్రకీలాద్రి

6లో..

భార్యను కడతేర్చిన భర్త అరెస్టు



ఫైళ్లు భద్రం

నూతన ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్లు దగ్ధం అవుతున్న నేపథ్యంలో ఫైళ్ల భద్రతపై ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. వీటిపై ప్రభుత్వం విచారణకు ఆదేశిస్తున్న నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లాలో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండటానికి సోమవారం కలెక్టర్ సృజన ప్రభుత్వ శాఖల అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్ల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వాటిని దగ్ధం చేసినా, పాడుచేసినా.. ఆయా అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

- దగ్ధం చేసినా.. మాయం చేసినా క్రిమినల్ కేసులు
- ఉద్యోగుల బదిలీల్లో మార్గదర్శకాలు పాటించాలి
- కార్యాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి
- రాత్రుళ్లు వాచ్‌మెన్‌లను కాపలా పెట్టండి
- అధికారులకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన సూచన
- ప్రజాసమస్యల పరిష్కార వేదికలో 99 అర్జీలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ సృజన కలెక్టర్ కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమం ముందు జిల్లా ప్రభుత్వ శాఖల అధికారులతో ఫైళ్ల దగ్ధంపై ఆమె మాట్లాడారు. ఇటీవల మదనపల్లి, తిరుపతి, పోలవరం తదితర ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్ల దగ్ధం ఘటనలు దృష్టిలో పెట్టుకుని జిల్లా అధికారులు మరింత అప్రమత్తతతో వ్యవహరించాలని చెప్పారు. కార్యాలయానికి సంబంధించిన ఫైళ్లు దగ్ధం చేయడం, చించడం, కనుమరుగు చేయడం వంటి ఘటనలు జరిగినట్టు తన దృష్టికి వస్తే ఆ శాఖల అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు శాఖా పరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి కార్యాలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి రాత్రి గస్తీకి వాచ్‌మెన్‌ను నియమించుకోవాలని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైర్ సేఫ్టీ, విద్యుత్ సరఫరా పరికరాలపై ఆడిటింగ్ నిర్వహించి అధికారుల నుంచి ధ్రువీకరణ పత్రాలు పొందాలన్నారు.

● బదిలీ మార్గదర్శకాలు తప్పక పాటించాలి

ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల గడువు ముగిసే వరకు నిరీక్షించకుండా ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు సమర్పించి ఆమోదం పొందాలని, బదిలీలకు జారీ చేసిన ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని అన్నారు. గ్రీవెన్స్ రీ ఓపెన్‌కు అస్కారం లేకుండా అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ సృజన అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని రీఓపెన్‌కు ఆస్కారం లేకుండా చిత్తశుద్ధితో సమస్యను పరిష్కరించాలని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో కోర్టు కేసులకు సంబంధించి ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేసుకోని చివరి నిమిషం వరకు వేచి చూడకుండా దాఖలు చేసేందుకు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. త్వరలో జిల్లాలో నిర్వహించనున్న రెవెన్యూ సదస్సుల నిర్వహణకు ముందస్తు ప్రణాళికలను రూపొందించుకోవాలని అన్నారు. సదస్సులో నమోదయ్యే ప్రతి అర్జీని రిజిస్టర్ చేసి అప్‌లోడ్ చేయాలని సదస్సులపై క్షేత్రస్థాయి సిబ్బంది పూర్తి అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

● 99 అర్జీల స్వీకరణ



ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా 99 అర్జీలను స్వీకరించగా 39 అర్జీలు స్వయంగానూ, 60 అర్జీలు ఆన్‌లైన్ ద్వారానూ స్వీకరించారు. ఇందులో రెవెన్యూ 42, పోలీసు 14, మున్సిపల్ కార్పొరేషన్ 13, సీఆర్‌డీఏ 4, పంచాయతీరాజ్ 3, కోపరేటీవ్ 3, వైద్య ఆరోగ్య శాఖ 2, సర్వే అండ్ సెటిల్‌మెంట్ 2, మార్కెటింగ్ 2 అర్జీలు, విద్యుత్ శాఖ, ఏపీఐఐసీ, ఏపీఎస్ఆర్టీసీ, ఎన్టీఆర్ వైద్య సేవ, పౌరసరఫరాలు, విద్య, ఉన్నత విద్య, దేవదాయ, అగ్నిమాపక, మత్స్య, మహిళా శిశు సంక్షేమం, గనులు, రోడ్లు భవనాలు, గ్రామీణ నీటి సరఫరా శాఖలకు చెందిన ఒక్కొక్క అర్జీనీ స్వీకరించారు.



కరపత్రం చూపుతున్న రైజ్ అండ్ రైజ్ సంస్థ చైర్మన్ ఉదయ్‌భాస్కర్

రైజ్ అండ్ రైజ్ నూతన వెంచర్ ప్రారంభం

అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 19 : రైజ్ అండ్ రైజ్ సంస్థ నూతన వెంచర్‌ను ఆంధ్రప్రభ కాలనీలోని సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సంస్థ చైర్మన్ ఉప్పలపాటి ఉదయ భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై నూతన వెంచర్ బ్రోచర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రైజ్ అండ్ రైజ్ సంస్థ 8 ఏళ్ల అనుభవంతో పది వెంచర్లను దిగ్విజయంగా పూర్తిచేసి శ్రీగంధం, ఖర్జూరం, ఎర్రచందనం తోటలను కస్టమర్లకు అతి తక్కువ ధరలకే అందించి అందరి మన్ననలూ పొందామన్నారు. నూతనంగా ప్రారంభించిన వెంచర్ కొత్తూరు తాడేపల్లిలోని కాపిటల్ స్పెస్ ఫేజ్-2ను నగరానికి 12 కిలోమీటర్ల దూరంలో, ఇన్నర్ రింగ్ రోడ్డుకు 200 మీటర్ల దూరంలో, గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకు కిలోమీటర్ దూరంలో, బస్టాండ్, రైల్వేస్టేషన్లకు 12 కిలోమీటర్ల దూరంలో, వెస్ట్ బైపాస్‌కు 4 కిలోమీటర్లు, జెట్‌సిటీకి 2 కిలోమీటర్ల దూరంలో ఉందన్నారు. అమరావతి రాజధానికి అతి తక్కువ దూరంలో నివాస యోగ్యమైన స్థలాలను అందిస్తున్న నమ్మకమైన సంస్థ రైజ్ అండ్ రైజ్ అని పేర్కొన్నారు. అనంతరం సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎంవీ.నాగరాజు మాట్లాడుతూ వెంచర్ ప్రత్యేకతలు తెలిపారు. ఆర్‌డీవో ల్యాండ్ కన్వెన్షన్, 30 అడుగుల బీటీ రోడ్లు, వెంచర్ మొత్తం గ్రావెల్‌తో ఫిల్లింగ్, చుట్టూ సెక్యూరిటీ ఫెన్సింగ్, ప్రధాన ద్వారాలకు గేట్లు, ప్రతి ప్లాట్ కస్టమర్ పేరుతో నేమ్ బోర్డులు, రెండు ఏళ్ల వరకు వాచ్‌మెన్ సెక్యూరిటీ సదుపాయాలు కలవని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు ఎస్.సన్యాసిరావు, పెద్దిరాజు, వీసీ కుమార్, ఎంవీవీ.కృష్ణారావు, టి.రాజు, ప్రముఖ వ్యాపారస్తులు పాల్గొన్నారు.

అత్యాచార నిందితుడిపై పోక్సో కేసు

తిరువూరు, ఆగస్టు 19 : బాలికపై అత్యాచారం చేసిన నిందితుడిపై పోక్సో కేసు నమెదు చేసినట్టు సీఐ గిరిబాబు సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ కేసుపై సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. విస్సన్నపేట మండలంలోని ఒక గ్రామానికి చెందిన 15 సంవత్సరాల బాలిక తిరువూరులోని ఒక వసతిగృహంలో ఉంటూ ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. ఆదే గ్రామానికి చెందిన తోట చందు రెండు నెలలుగా ప్రేమించమంటూ వెంటపడుతున్నాడు. మరో ఇద్దరు మైనర్లు కూడా చందును ప్రేమించమని బాలికపై వత్తిడి తెచ్చారు. ఇటీవల అనారోగ్యానికి గురైన బాలిక ఇంటి నుంచి పట్టణంలోని కాలేజీకి డైలీ సర్వీసు చేస్తోంది. ఈనెల 10వ తేదీన బోసుబొమ్మ సెంటర్‌లో బస్సులో వస్తున్న బాలికను చందు బలవంతంగా కిందకు దింపాడు. బాలికను తన మిత్రులతో బైక్‌పై ఎక్కించుకొని, కూరగాయాల మార్కెట్ సమీపంలోని ఒక భవనంలోకి తీసుకువెళ్లాడు. ఆమెపై నిందితుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. తదుపరి బాలికను ఖమ్మం జిల్లా మర్లపాడు, వేంసూరు రోడ్డులోకి తీసుకువెళ్లాడు. అనంతరం బాలిక స్వగ్రామం సమీపంలోని కాల్వ వద్ద దింపి జరిగిన విషయం ఎవరికైనా చెపితే చంపుతానని బెదిరించాడు. బాధితురాలు తన తల్లికి విషయం చెప్పగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్సై సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆధునికతతో నూతన పారిశ్రామిక విధానం

- ఏపీ ఐడీపీ రూపకల్పనకు ప్రభుత్వం కసరత్తు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన

కృష్ణలంక, ఆగస్టు 19 : ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో పాటు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వైపుగా పారిశ్రామికరంగం వెళ్లాల్సిన అవసరముందన్న ముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం నూతన పారిశ్రామిక విధానం (2024-29) రూపకల్పనకు కసరత్తు చేస్తోందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త పారిశ్రామిక విధానాన్ని రూపొందించనున్న నేపథ్యంలో పరిశ్రమల శాఖ మార్గదర్శకాలను అనుగుణంగా వివిధ పారిశ్రామిక అసోసియేషన్ల నుంచి అభిప్రాయాలు, సూచనలు స్వీకరించేందుకు కలెక్టర్ సృజన సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పారిశ్రామిక వర్గాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పారిశ్రామిక విధానం (2015-20), పారిశ్రామిక విధానం (2023-27), పరిశ్రమలకు ప్రోత్సాహకాలు, ఎంఎస్ఎంఈలు, పారిశ్రామిక అనుమతులు, భూ కేటాయింపులు, సిక్ యూనిట్లకు మద్దతు, విద్యుత్ సరఫరా వంటి మౌలిక వసతుల కల్పన, పారిశ్రామిక వ్యర్థాల నిర్వహణ తదితరాలపై చర్చించారు. స్థానిక పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి, కళాశాలలతో పారిశ్రామిక యూనిట్ల అనుసంధానం, కొత్త సాంకేతికతలు, పరిశ్రమల కార్యకలాపాలకు అవసరమయ్యే ముడిసరుకు సక్రమ సరఫరా, పారిశ్రామిక క్లస్టర్లు-వసతులు, పారిశ్రామిక ఉత్పత్తుల మార్కెటింగ్, గవర్నమెంట్ ఈ-మార్కెట్ ప్లేస్ (జీఈఎం), ఈ-ప్రొక్యూర్‌మెంట్ తదితర అంశాలు కూడా సమావేశంలో చర్చకు వచ్చాయి. సమావేశంలో పారిశ్రామిక అసోసియేషన్ల ప్రతినిధులు వెలిబుచ్చిన అభిప్రాయాలు, సలహాలు, సూచనలతో నివేదికను ప్రభుత్వానికి పంపనున్నట్టు కలెక్టర్ సృజన తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి ఎ.సుధాకర్, ఫ్యాప్సియా ప్రెసిడెంట్ వి.మురళీకృష్ణ, మహిళా పారిశ్రామిక వేత్తల అసోసియేషన్ ప్రతినిధి కనకదుర్గ పాల్గొన్నారు.

రూ.160 కోట్లతో ఉపాధి పనులు

- రూ. 220 కోట్లతో బందరులో ప్రతి ఇంటికీ తాగునీరు
- విలేకరుల సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 19 : కృష్ణాజిల్లాలో రూ.160 కోట్లతో ఎన్ఆర్ఈజీఎస్ పనులకు నిధులు మంజూరయ్యాయని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఆబ్కారీ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు. సోమవారం ప్రజాదర్బార్ కార్యక్రమం అనంతరం జరిగిన మీడియా సమావేశంలో కొల్లు రవీంద్ర మాట్లాడారు. గ్రామాల్లో రోడ్లు, డ్రెయిన్లు, శ్మశాన వాటికలు అభివృద్ధి చేసేందుకు ఈ నిధులు వినియోగిస్తారన్నారు. మచిలీపట్నం నియోజకవర్గంలో రూ.33 కోట్లతో ఎన్ఆర్ఈజీఎస్ కింద వివిధ అభివృద్ధి పనులు చేపడతామన్నారు. జల జీవన్ మిషన్ కింద బందరు మండలంలో రూ.220 కోట్లతో ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి కనెక్షన్లు ఇచ్చేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. మచిలీపట్నం ఈస్ట్ పరిధిలో చిలకలపూడి రైల్వేగేటు నుంచి పెదపట్నం వరకు ఉండే గ్రామాల్లో రూ.105 కోట్లతో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటుకు ప్రత్యేక ప్రతిపాదనలు పంపామన్నారు. అమృత్ ఫేస్ 2 కింద మచిలీపట్నం నగర పాలక సంస్థ పరిధిలో పెద్దఎత్తున మ్యాచింగ్ ఫండ్స్ మంజూరయ్యేందుకు కృషి చేశామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ శ్రావణమాసం పూర్తయ్యేలాగా గృహ ప్రవేశాలు చేయిస్తామన్నారు. ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలపై ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ సమావేశంలో గుడివాడ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మోటమర్రి బాబాప్రసాద్, గోపు సత్యనారాయణ, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, నగర టీడీపీ అధ్యక్షుడు ఇలియాస్ పాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

● ప్రజా దర్బార్‌కు వినతుల వెల్లువ

మచిలీపట్నం టీడీపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి బాధితులు తరలివచ్చారు. పింఛన్లు ఇప్పించాలని దివ్యాంగులను తల్లిదండ్రులు తీసుకొచ్చారు. మండవల్లి మండలం సింగన్నపూడి నుంచి 20 ఏళ్ల దివ్యాంగుడిని తల్లిదండ్రులు వీరాంజనేయులు, అంజలీదేవి తీసుకుని వచ్చారు. తన కుమారుడు నూరుశాతం దివ్యాంగుడని, రూ.15 వేల పింఛను ఇప్పించాలని బాధితులు కోరారు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు పలువురు ఇళ్లను స్వాధీనపరచాలని కోరారు. పలువురు నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. రోడ్లు, డ్రెయిన్లు మెరుగుపరచాలని మరికొందరు కోరారు. పెద్ద సంఖ్యలో మచిలీపట్నం నియోజకవర్గ ప్రజలతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలు కూడా మంత్రికి తమ గోడు వినిపించుకునేందుకు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్రతో పాటు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, పిప్పళ్ల కాంతారావు, గోపు సత్యనారాయణ, తలారి సోమశేఖర్, కుంచే నాని పాల్గొన్నారు.



పింఛను కోసం మండవల్లి మండలం సింగన్నపూడి నుంచి దివ్యాంగుడు శ్రీరామమూర్తిని తీసుకువచ్చిన తల్లి అంజలీదేవి

కలిసి.. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేద్దాం

- అనంతవరంలో పాలకేంద్ర భవనాన్ని ప్రారంభించిన ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్
- నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయాలని ఎంపీని కోరిన ఎమ్మెల్యే

మైలవరం రూరల్, ఆగస్టు 19 : మైలవరం నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కలిసి పనిచేద్దామని మైలవరం స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)ని కోరారు. ఎంపీ నిధుల వాటా ప్రకారం ఎలాగూ మంజూరు చేస్తారని, రాజధానికి దగ్గరగా ఉన్న మైలవరానికి ప్రాధాన్యతనిస్తూ కేంద్రం నుంచి అదనంగా నిధులు మంజూరు చేసేలా కృషి చేయాలని కోరారు. మండలంలోని అనంతవరంలో రూ.4.25 లక్షలతో నూతనంగా నిర్మించిన పాలకేంద్ర భవనాన్ని ఎంపీ చిన్ని, ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు సోమవారం ప్రారంభించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులో ఉన్నా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్లు అందజేయడం, రాజధాని అమరావతి నిర్మాణం కోసం చర్యలు మొదలుపెట్టడంతో ప్రభుత్వంపై ప్రజలకు మరింత విశ్వాసం, నమ్మకం పెరిగిందన్నారు. ఇబ్రహీంపట్నం ఫెర్రీ ఘాట్ వద్ద కృష్ణానది హారతి కార్యక్రమం ప్రారంభిస్తామని, గొల్లపూడి దగ్గర వెస్టన్ బైపాస్ పనులు ప్రారంభిస్తామని అన్నారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ అమూల్ సంస్థను ఏపీలో ప్రవేశపెట్టి స్థానిక డెయిరీలను దెబ్బతీయాలని గత ప్రభుత్వం చూసిందని, ఆ అప్రజాస్వామిక విధానాలను ప్రజలు తిప్పి కొట్టారని పేర్కొన్నారు.



పాలకేంద్ర భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

● ఎంపీ చిన్నికి ఎమ్మెల్యే వినతి

జి.కొండూరు మండలంలోని సున్నంపాడు, మునగపాడు గ్రామాల మధ్య గత ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి సేకరించిన సుమారు 270 ఎకరాలు భూమి నిరుపయోగంగా పడి ఉందన్నారు. ఈ భూమిని విజయవాడ ప్రాంత వాసుల ఇళ్ల స్థలాల కోసం అప్పట్లో కేటాయించారని కానీ ఒక్క ఇంటి నిర్మాణం కూడా జరగలేదని, జరగబోదని చెప్పారు. ఈ భూమిని తాజాగా పరిశ్రమల కోసం కేటాయిస్తే స్థానిక యువతకు ఉద్యోగాలు లభిస్తాయని, ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతున్నారు. విజయవాడ ప్రాంతవాసుల ఇళ్ల స్థలాలకు జక్కంపూడి శివారులో 50 ఎకరాలు కొనుగోలు చేసి టిడ్కో ఇళ్లు నిర్మిస్తే ప్రయోజనం కలుగుతుందన్నారు. దీనిపై ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నానని, మంత్రి నారా లోకేశ్‌కు సమస్యపై ఇద్దరం కలిసి వినతిపత్రం ఇద్దామని కోరారు. అనంతరం ఎంపీ చిన్నిని, ఎమ్మెల్యే వసంతను, చైర్మన్ ఆంజనేయులను బొందలపాటి సుధాకర్ దంపతులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ డైరెక్టర్ ఈశ్వర్‌బాబు, తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, పాలకేంద్రం అధ్యక్షురాలు బొందలపాటి శైలజ, టీడీపీ నాయకులు బొందలపాటి సుధాకర్ పాల్గొన్నారు.



నిందితుడిని చూపిస్తున్న సీఐ వి.శుభాకర్

భార్యను కడతేర్చిన భర్త అరెస్టు

పెదపారుపూడి : భార్యను హత్య చేసిన ఘటనలో భర్త రాజేష్‌ను అరెస్టు చేసినట్టు పామర్రు సీఐ వి.శుభాకర్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. నక్కా సునీత వివాహేతర సంబంధం పెట్టుకుందనే అనుమానం ఆమె భర్త రాజేష్‌కు ఉండేది. 17వ తేదీ రాత్రి సునీత షాపులో పని చేసి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో రాజేష్ పెదపారుపూడి నుంచి బైక్‌పై తీసుకుని వచ్చి మహేశ్వరపురం గ్రామ శివారులో ఆపాడు. పక్కనే ఉన్న పంట బోదులోకి తీసుకెళ్లి నీటిలో ముంచి ఊపిరి ఆడకుండా చేసి చంపేశాడు. చనిపోయిందని నిర్ధారించుకున్నాక దూళ్లవానిగూడెం పక్కనే ఉన్న రైల్వే పట్టాలపై పడేశాడు. సోమవారం రాజేష్ కోసం వెతుకున్న క్రమంలో దోసపాడు రైల్వే స్టేషన్ వద్ద ట్రైన్ ఎక్కి పారిపోదామని ప్రయత్నిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తను చేసిన నేరాన్ని అంగీకరించాడు.

కన్నులపండువగా గిరిప్రదక్షిణ

కిక్కిరిసిన ఇంద్రకీలాద్రి



గిరిప్రదక్షిణలో కళాకారుల డప్పు విన్యాసాలు

వన్‌టౌన్, ఆగస్టు 19 : దుర్గామల్లేశ్వర దేవస్థానం ఆధ్వర్యంలో శ్రావణ పౌర్ణమి సందర్భంగా భక్తిప్రపత్తులతో గిరిప్రదక్షిణ నిర్వహించారు. ప్రతి పౌర్ణమికి దుర్గమ్మవారి గిరి ప్రదక్షిణ కార్యక్రమం జరుగుతుంది. సోమవారం ఘాట్‌రోడ్డు వద్ద అమ్మవారి వాహనానికి ఈవో రామారావు పూజలు నిర్వహించి గుమ్మడికాయను బలిహరణ గావించి, హారతులు సమర్పించి గిరిప్రదక్షిణను ప్రారంభించారు. ఆయన కూడా కొండచుట్టూ ప్రదక్షిణలో పాల్గొన్నారు. తప్పెట వాయిద్యాలు, భక్తుల కోలాహలం, కోలాట, భజన బృందాలు ముందుకు సాగుతుండగా అమ్మవారి గిరిప్రదక్షిణ కొనసాగింది. ఈ గిరిప్రదక్షిణ ఉదయం 5.55 గంటలకు ప్రారంభమై 9.30 గంటలకు ముగిసింది. గిరి ప్రదక్షిణ ఘాట్ రోడ్డు నుంచి ప్రారంభమై కుమ్మరిపాలెం, నాలుగు స్తంభాల సెంటర్, సొరంగం జంక్షన్, కబేలా సెంటర్, సీవీఆర్ బ్రిడ్జి, పాలఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, మెయిన్ రోడ్డు నుంచి రథం సెంటర్ మీదుగా ఘాట్ రోడ్డు వద్ద ప్రదక్షిణ ముగిసింది.

● దుర్గగుడిలో ధ్యానయజ్ఞం

పౌర్ణమి సందర్భంగా సోమవారం ప్రత్యేకంగా 9 టు 9 (12 గంటలపాటు) అఖండ ధ్యాన యజ్ఞం నిర్వహించారు. ప్రతి పౌర్ణమి నాడు ధ్యాన యజ్ఞం నిర్వహించేందుకు ఈవో రామారావు ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకున్నారు.

● దుర్గమ్మను దర్శించుకున్న మంత్రి సుభాష్

రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖల మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం కుటుంబసభ్యులతో కలిసి ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఏఈఓ రమేష్ బాబు ఇతర అధికారులు, అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలు అందించారు. అమ్మవారి దర్శనానంతరం అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రం అందించారు. సోమవారం కనకదుర్గమ్మవారి దర్శనానికి వచ్చిన సందర్భంలో మంత్రి వాసంశెట్టి సుభాష్ భక్తులతో పాటే మంత్రి, కుటుంబ సభ్యులు కూర్చొని భోజనం చేశారు.

గడువులోగా అర్జీలను పరిష్కరించండి

మీ కోసం వినతులపై ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ



అర్జీదారుల సమస్య వింటున్న ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ

మచిలీపట్నం : ప్రజాసమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ అధికారులను ఆదేశించారు. మీకోసం కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన 46 అర్జీలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. సీఎం కార్యాలయం నుంచి వచ్చే అర్జీలను పరిష్కరించడంలో అలసత్వం ప్రదర్శించవద్దని అధికారులకు సూచించారు. మీకోసం కార్యక్రమం ద్వారా వచ్చిన అర్జీల పరిష్కారంపై పరిశీలించేందుకు జిల్లా, రాష్ట్ర స్థాయిలో నోడల్ అధికారులను నియమించారని, అర్జీల పరిష్కారంపై ప్రతిరోజూ నోడల్ అధికారులు సమీక్ష నిర్వహిస్తున్నారని, జిల్లాస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

పరిశ్రమల స్థాపనకు సలహాలు ఇవ్వండి

రాష్ట్రంలో మెరుగైన పారిశ్రామిక విధానాన్ని ప్రభుత్వం అమలు చేసేందుకు కృతనిశ్చయంతో ఉందని, పరిశ్రమల స్థాపనలో తీసుకోవాల్సిన చర్యలపై జిల్లాకు చెందిన పారిశ్రామికవేత్తలు తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ అన్నారు. జిల్లా పరిశ్రమలు, ప్రోత్సాహక కమిటీ సమావేశం సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతన పారిశ్రామిక విధానం-2024-29ను త్వరలో ప్రకటించనుందని అన్నారు. పారిశ్రామికవేత్తలు ఈ నూతన విధానంలో ఎలాంటి చర్యలు తీసుకోవాలో తెలియజేయాలన్నారు. మల్లవల్లి పారిశామికవాడ, మచిలీపట్నం ఇమిటేషన్ జ్యువలరీ, ఆక్వా, ప్లాస్టిక్, ఎమ్మెస్ఎంఈ పారిశ్రామికవేత్తల నుంచి సూచనలు తీసుకున్నారు.

గుణదల ఈఎస్ఐని 300 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తాం

● మంత్రి వాసంశెట్టి సుభాష్ వెల్లడి ● ఆస్పత్రి నూతన ప్రాంగణం ప్రారంభం... బెడ్స్ పరిశీలన

ప్రభుత్వాసుపత్రి, ఆగస్టు 19 : గుణదల ఈఎస్ఐ ఆసుపత్రిని 300 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయడంతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రణాళిక సిద్ధం చేశామని రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. గుణదలలోని ఈఎస్ఐ ఆసుపత్రి నూతన ప్రాంగణాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఈఎస్ఐ ఆసుపత్రులన్నింటిని దశలవారీగా అభివృద్ధి చేయనున్నామన్నారు. కార్మిక కుటుంబాలకు సత్వర వైద్య సేవలందించే విధంగా ఈఎస్ఐ ఆసుపత్రిలో అన్ని రోగాలకు వైద్యం అందే విధంగా అభివృద్ధి చేస్తామన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఈఎస్ఐ ఆసుపత్రులను నిర్వీర్యం చేశారని, సరైన పరికరాలు లేకుండా ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయకుండా కార్మికులను ఇబ్బందుల పాలు చేశారని మండిపడ్డారు. వైఎస్సార్ బీమా పేరుతో సొంత ఇన్సూరెన్స్ కంపెనీ ఏర్పాటు చేసి అవకతవకలకు పాల్పడ్డారని, వీటిపై విజిలెన్స్ విచారణకు ఆదేశించామని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ వ్యవసాయం తరువాత ప్రాధాన్యత గల కార్మిక రంగాన్ని ప్రభుత్వం మరింత బలోపేతం చేస్తుందన్నారు. ఈఎస్ఐ ఆసుపత్రిని కార్మిక కుటుంబానికి ఆరోగ్య భరోసా అందించే విధంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. కార్మిక శాఖ ప్రధాన కార్యదర్శి ఎంఎం.నాయక్, ఎమ్మెల్సీ అశోక్‌బాబు పాల్గొన్నారు.



బెడ్స్ పరిశీలిస్తున్న మంత్రి సుభాష్, ఎమ్మెల్యే గద్దె



ఆసుపత్రి నూతన ప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	116, 125, 136
చికెన్ విత్ స్కిన్	226
చికెన్ స్కిన్‌లెస్	236



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.75

సీనియర్ ఫొటోగ్రాఫర్లకు సత్కారం

ఉయ్యూరు, ఆగస్టు 19 : ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎంకే అసోసియేట్స్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయుడు, ఫొటోజర్నలిస్టు ఎస్‌ఎం పాషా, వంశీ స్టుడియో అధినేత ఇద్రీస్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేశారు. క్లబ్‌జోనల్ చైర్‌పర్సన్ ఎండీ ఇస్మాయిల్, క్లబ్ అధ్యక్షుడు నేరెళ్ల తేజ సాయి వెంకట్, కార్యదర్శి నెల్లి రాంబాబు, ట్రెజరర్ దినవహి ప్రసాద్ పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు, ఫొటోగ్రాఫర్లు

అందరికీ నాణ్యమైన విద్య ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, ఆగస్టు 19 : అందరికీ నాణ్యమైన విద్య ప్రభుత్వ లక్ష్యమని ఆ ఉద్దేశంతోనే ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తుందని, ఇందుకు దాతలు కూడా ముందుకు వచ్చి పాఠశాలల అభివృద్ధికి సహకారం అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. మండలంలోని దావాజీగూడెం జడ్పీహైస్కూల్‌లో దాత మాగంటి మురళీ దంపతుల సహకారంతో రూ.29 లక్షల వ్యయంతో నిర్మించిన భోజన వసతిశాలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ మాట్లాడుతూ, ప్రభుత్వంతో పాటు దాతలు కూడా ముందుకు వస్తే ప్రభుత్వ పాఠశాలల్లో మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించవచ్చన్నారు. మనుషులు కన్న డబ్బులను ఎక్కువ ప్రేమిస్తున్న నేటి సమాజంలో విద్యార్థుల భోజన వసతిశాల నిర్మాణానికి రూ.29లక్షలు ఇచ్చి దాత మాగంటి మురళీ తన దాతృత్వాన్ని మరోసారి చాటుకున్నారని ఇలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ సేవ చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఎంఈవో-2 కమల, వైస్ ఎంపీపీ కొమ్మురాజు సుధీర్, సర్పంచ్ బడుగు బాలమ్మ, ఎంపీటీసీ పడమట రంగారావు, డీఎస్పీ మురళీ, టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, కార్యదర్శి బోడపాటి రవి, నాయకులు బొప్పిడి దొరబాబు, గొంది నరేంద్ర, కారంపూడి సాంబశివరావు, గూడవల్లి భవాని ప్రసాద్, గొంది శివకోటేశ్వరరావు, ముద్రబోయిన శ్రీనివాస రావు, కొసరాజు రాము, మేడేపల్లి రమ, చిక్కవరపు నాగమణి, బడుగు ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును సన్మానిస్తున్న బ్రాహ్మణ పరిషత్ సభ్యులు

ఘనంగా విఖనాస మహర్షి జయంతి

మండలంలోని దావాజీగూడెం సీతారామచంద్ర స్వామివారి ఆలయంలో సోమవారం శ్రావణ పౌర్ణమి, విఖనాస మహర్షి జయంతి మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. గన్నవరం వైఖానస యూత్ ఫోరం శాఖ వారి ఆధ్వర్యంలో ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం పూజల అనంతరం విఖనాస మహర్షి స్వామివారికి పంచామృతాలతో అభిషేకం చేశారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన రథంలో శోభయాత్ర జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు విశేష పూజలు చేశారు. బ్రాహ్మణ పరిషత్ సభ్యులు మంత్రోచ్చరణల మధ్య దుశ్శాలువాలతో సత్కరించారు. పరిసర గ్రామాల నుంచి వైఖానసులు, గన్నవరం బ్రాహ్మణ పరిషత్ సభ్యులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు. అన్నసమారాధన జరిపారు.

హత్యాచార నిందితులను శిక్షించాలి

టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ప్రదర్శనలో ముప్పా రాజా, పులి శ్రీనివాసరావు తదితరులు

కంకిపాడు, ఆగస్టు 19 : పశ్చిమ బెంగాల్‌లో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన హత్యాచారం దురదృష్టకరమని టీడీపీ, జనసేన సమన్వయకర్త ముప్పా రాజా అన్నారు. ఘటనకు నిరసనగా కంకిపాడు సెంటర్‌లో సోమవారం రాత్రి టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ముప్పా రాజా మాట్లాడుతూ, ప్రజలకు సేవలందించే వైద్యులకు రక్షణ కల్పించటంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. పశ్చిమ బెంగాల్‌లో వైద్యులకు రక్షణ లేకపోవడం సిగ్గుచేటన్నారు. హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రభుత్వం ప్రయత్నించటం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు సుంకర శివ, బోయిన నాగరాజు, కుంటా గంగాధర్, మేదంద్రావు సతీష్, ముప్పా చంద్రశేఖర్, పిచుక రవి, క్రాంతి, టీడీపీ నాయకులు పులి శ్రీనివాసరావు, కొండా నాగేశ్వరరావు, గోగినేని వెంకటరమణ, వణుకూరు విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలి : సీపీఎం


మాదలవారిగూడెం సచివాలయంలో వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

గన్నవరం, ఆగస్టు 19 : మండలంలోని చనుపల్లివారిగూడెం, మాదలవారిగూడెం గ్రామాల్లో విషజ్వరాలతో గత నెల రోజులుగా ప్రజలు అల్లాడిపోతున్నారని సీపీఎం మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు అన్నారు. సోమవారం మాదలవారిగూడెం సచివాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ, జ్వరాలు బారిన పడిన ప్రతి ఒక్కరు కాళ్లు, తల నొప్పులు కీళ్ల నొప్పులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సరైన వైద్య సదుపాయం లేక ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తుంటే వేలాది రూపాయలు ఖర్చు అవుతున్నాయని తక్షణమే గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బి.తాతబ్బాయి, ఎన్. కోటేశ్వరరావు, సుబ్బారావు, సుధాకర్, రవికుమార్, నాని బాబు, బూసిమ్మ, జయలక్ష్మి, తిరుపతిరావు, సత్యం, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, మోహనరావు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై 23న ప్రత్యేక గ్రామసభలు


ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

ఉంగుటూరు, ఆగస్టు 19 : ఉపాధిహామీ పథకంలో 2024-25సంవత్సరంలో చేపట్టనున్న వివిధ రకాల పనుల ఆమోదానికై ఈనెల 23వ తేదీ శుక్రవారం మండలంలోని అన్నిగ్రామపంచాయతీల్లో ఒకేరోజు ప్రత్యేక గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జీఎస్‌వీ శేషగిరిరావు తెలిపారు. ఉపాధిపథకం పనులకు సంబంధించి గ్రామసభల నిర్వహణ, విధివిధానాలపై రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సోమవారం రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఉపాధిహామీపథకం, అనుబంధ విభాగాలకు చెందిన మండల, గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఎంపీడీవో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఉపాధిహామీ (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్) అనుబంధ విభాగాల పరిధిలో చేపట్టాల్సిన పలు రకాల పనులకు సంబంధించి ఆయా శాఖల అధికారులు, ఉపాధి పథకంలోని క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది, మేట్లు, కూలీలతోపాటు, పంచాయతీ గ్రేడ్-1, గ్రేడ్-5 కార్యదర్శులు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు గ్రామసభల్లో చర్చించి ఆమోదం తెలుపుతారని పేర్కొన్నారు.

ఈడుపుగల్లులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన


డ్రెయినేజీ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న దేవినేని రాజా, సర్పంచ్ ఇందిర

ఈడుపుగల్లు (కంకిపాడు), ఆగస్టు 19 : మండలంలోని ఈడుపుగల్లు గ్రామాభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మాజీ ఎంపీపీ దేవినేని రాజాలకు ఈడుపుగల్లు గ్రామ ప్రజలు రుణపడి ఉంటారని ఈడుపుగల్లు సర్పంచ్ పందిపాటి ఇందిర అన్నారు. ఈడుపుగల్లులోని ఎస్సీ కాలనీలో రూ. 5 లక్షలతో ఏర్పాటు చేస్తున్న డ్రెయినేజీ పనులకు మాజీ ఎంపీపీ దేవినేని రాజాతో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పందిపాటి ఇందిర మాట్లాడుతూ, గ్రామంలో గ్రామంలో డ్రెయినేజీ అభివృద్ధికి పలు చర్యలు చేపడుతున్నామన్నారు. ఎస్సీ కాలనీల్లో నివాసముంటున్న వారు రోడ్లను ఆక్రమించి ముందుకు రావడం జరిగిందని, వారిని సముదాయించి డ్రెయినేజీ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. గ్రామంలో మూడు, నాలుగు రోడ్లు అభివృద్ధి చేయాల్సి ఉందని వాటిని కూడా త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు షేక్ షకార్, జిల్లా టీడీపీ కార్యదర్శి పంది పాటి సుధాకర్, వార్డు సభ్యులు శ్రీ హరి, శ్రీనివాస రావు, బండారు ప్రవీణ, గ్రామస్థులు, టీడీపీ నాయకులు చెల్లి సంగీత రావు, రాము, ధర్మయ్య, చిన్నబాబు, మోహన్‌రావు, మన్నే కృప, టీడీపీ నేత పులి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని దివ్యాంగుడు మృతి

పమిడిముక్కల : మంటాడ - లంకపల్లి ఆర్ అండ్ బి రోడ్డులో వీరంకిలాకుల వద్ద సోమవారం బైక్ ఢీకొని దివ్యాంగుడు మృతి చెందాడు. పమిడిముక్కల గ్రామానికి చెందిన పులిపాక కుటుంబరావు (38) రోడ్డుపై నడుస్తున్న సమయంలో వెనుక నుంచి వచ్చిన బైక్ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన కుటుంబరావును ప్రాథమిక చికిత్స అనంతరం విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాడిగడప మునిసిపాలిటీలో
మౌలిక సౌకర్యాల కల్పనకు కృషి

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, ఆగస్టు 19 : టీడీపీ కూటమి ప్రభుత్వ హయాంలో తాడిగడప మునిసిపాలిటీలోని ప్రజలకు కనీస మౌలిక సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. సోమవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు పల్లెల అభివృద్ధిపై దృష్టి పెట్టడం జరుగుతోందన్నారు. నియోజకవర్గంలోని అంతర్గత రహదారుల కోసం రూ. 17కోట్లను కేటాయించడం జరిగిందన్నారు. మురుగుపారుదల వ్యవస్థ కోసం షుమారు ఆరుకోట్ల నిధులను కేటాయించడం జరిగిందన్నారు. గ్రామాల ప్రధాన రహదారుల గుంతలు పూడ్చడం, అభివృద్ధికి రూ. 80 లక్షలు కేటాయించడం జరిగిందన్నారు. డీఎంఎఫ్‌టీ రివైజ్డ్ ప్రపోజల్ కింద రూ.1.15 కోట్లు కేటాయించామన్నారు. మునిసిపాలిటీ పరిధిలో రూ.10 కోట్లతో తాగునీటి సమస్యలు, డ్రెయినేజీలు, రహదారులపై రెండు నెలల్లో పనులు పూర్తి చేస్తామని తెలిపారు.

కారకంపాడులో శ్రీముఖ లింగేశ్వరస్వామి ఆలయానికి శంకుస్థాపన



కూచిపూడి : మొవ్వ మండలం కారకంపాడులో శ్రీ బాలాత్రిపుర సుందరిదేవి సమేత శ్రీముఖ లింగేశ్వరస్వామి ఆలయ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సతీసమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ రొండి కృష్ణ యాదవ్, గ్రామసర్పంచ్ నాగనబోయిన సునీల్, లింగమనేని రామలింగేశ్వరరావు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే బోడె ప్రసాద్, ఎమ్మెల్సీ వైవీబీ


పూర్ణహుతి హోమంలో ఎంపీ కేశినేని శివనాథ్, లక్ష్మణరెడ్డి

పెదఓగిరాల(ఉయ్యూరు), ఆగస్టు 19 : పెదఓగిరాల వేంకటేశ్వర స్వామి, సాయినాథస్వామి, పరివార దేవతల ప్రతిష్ఠ సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనము, ప్రాయశ్చిత్త హోమములు, మహాకుంభాభిషేకముతో ప్రారంభమైన స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం వేదఘోషతో హోరెత్తింది. ఆలయ నిర్మాణ దాతలు దొంతిరెడ్డి లక్ష్మణరెడ్డి, భీమవరపు పరమేశ్వరరెడ్డి దంపతులు, పూనూరు గౌతమ్‌రెడ్డి దంపతులు పూజా, హోమాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రతిష్ఠ సమయం లో గోవింద నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. పెద ఓగిరాల పరిసర గ్రామాలతో పాటు పలు ప్రాంతా లనుంచి భక్తులు తరలిరాగా ఆల య ప్రాంగణం కిక్కిరిసింది. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పెద్దఎత్తున అన్న సమారాధన చేశారు.

ప్రమాదవశాత్తు మినీ వ్యాన్ దగ్ధం



హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 19 : చెత్త తగలబెడుతుండగా అగ్గిరవ్వలు ఎగిసిపడి ప్రమాదవశాత్తు మినీవ్యాన్‌కు అంటుకుని తగలబడిన ఘటన మల్లవల్లి పారిశ్రామిక వాడలో సోమవారం తెల్లవారు జామున జరిగింది. మల్లవల్లి పారిశ్రామికవాడలోని ఒక ఫ్యాక్టరీకి ఇనుము తీసుకువచ్చి దిగుమతి చేసిన తరువాత వ్యాన్ యజమాని గంగాశివ మినీ వ్యాన్‌ను అక్కడే నిలిపి ఉంచాడు. మినీ వ్యాన్‌కు కొద్ది దూరంలో చెత్తను తగలబెడుతున్నారు. చెత్త నుంచి అగ్గిరవ్వలు ఎగిసిపడి వాహనానికి అంటుకున్నాయి. స్థానికులు హనుమాన్‌జంక్షన్ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది స్థానికుల సహకారంతో మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే వాహనం పూర్తిగా దగ్ధమైంది. నష్టం విలువ సుమారు రూ.2లక్షల వరకు ఉండవచ్చని ఫైర్ ఆఫీసర్ మోహనరావు తెలిపారు.

ప్రేమానురాగాలు పెంచే రక్షాబంధన్

గన్నవరం, ఆగస్టు 19 : సోదర సోదరీమణుల మధ్య ప్రేమానురాగాలను పెంచే పండుగే రక్షాబంధన్ అని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. మండలంలో రాఖీ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అన్నా, తమ్ముళ్లకు తమ సోదరి రాఖీలు కట్టి సందడి చేశారు. గన్న వరంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు మేడేపల్లి రమాదేవి, మండల అధ్యక్షురాలు చిక్కవరపు నాగమణి రాఖీ కట్టి స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ సోదర భావంతో కలసిమెలసి ఉండాలని తెలిపారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : మహిళలకు అండగా నిలుస్తూ ఆర్థికాభివృద్ధికి, స్వావలంబనకు చేయూతనిచ్చేది ఎన్డీయే కూటమి ప్రభుత్వం మాత్రమేనని తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికళ్యాణి తెలిపారు. రక్షాబంధన్ సందర్భంగా సోమవారం విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌కు, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రా వుకు రాఖీ కట్టి శుభాకాం క్షలు తెలియజేశారు. ప్రజాదర్బార్ నిర్వహిస్తున్న నారా లోకేశ్‌ను మార్యద పూర్వకంగా కలిసి రాఖీ కట్టి ఆశీస్సులందుకున్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు స్వగృహంలో ఆయన చేతికి రాఖీ కట్టి ఆశీస్సులందుకున్నారు. మహిళా సంక్షేమమే లక్ష్యంగా గౌరవం, భద్రత కల్పించేలా టీడీపీ, జనసే న, బీజేపీ నాయకులు కృషి చేస్తున్నారన్నారు.



ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు రాఖీ కడుతున్న సాయి కల్యాణి, మేడేపల్లి రమాదేవి

విద్యార్థుల్లో సోదరభావం


మల్లవల్లి ఎంపీపీ స్కూల్‌లో..

విద్యార్థుల్లో సోదరభావం పెంపొందించే విధ గా సమాజంలో మహిళపట్ల గౌరవభావంతో మెలిగేలా పాఠశాల స్థాయిలోనే అలవాటు చేసేందుకు సామూహిక రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని హెచ్‌ఎం కృష్ణమోహన్ అన్నారు. మల్లవల్లి ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం సక్కుబాయమ్మ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే నైతిక విలువలు పెంపొందించే విధంగా వినూత్న కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సామూహిక రక్షాబంధన్ కార్యక్రమ రూపకర్త శివనాగకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

కంకిపాడు : అన్నా, చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలకు సూచకంగా జరుపుకునే రక్షా బంధన్ వేడుకలను మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం ఘనంగా జరుపుకున్నారు. అక్కా తమ్ముళ్లు జరుపుకునే మహోత్తరమైన పండుగ చెల్లి తన అన్న మహోన్నత శిఖరా లను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ ఈ రాఖీని కడుతుంది. మాజీ ఎంపీపీ దేవినేని రాజాకు వార్డు సభ్యురాలు షైనేని దుర్గాభవాని రాఖీ కట్టారు. అదే విధంగా జనసేన పార్టీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయ కర్త ముప్పా రాజాకు ఆయన చెల్లెళ్లు మేదంద్రావు తేజస్వీ, ఎండువ అమ్ము, యలిశెట్టి జ్యోష్ణ తదితరులు రాఖీ కట్టి అనుబంధాన్ని చాటుకున్నారు.

ఉయ్యూరు : సృష్టిలో ఎన్ని బంధాలున్నా రక్తం పంచుకు పుట్టిన అన్నా చెల్లెళ్ల, అక్కాతమ్ముళ్ల బంధం అమూల్యమైన బంధమని భావించి సోమవారం రాఖీ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. అన్నదమ్ములకు అక్కచెల్లెళ్లు రాఖీలు కట్టి ఆశీర్వదించారు. ఈసందర్భంగా రాఖీ బంధన్ విశిష్టతను వివరించి అన్నదమ్ములు అక్కచెల్లెళ్ల ప్రేమానురాగాలు చాటారు.


కంకిపాడులో రాఖీ కడుతున్న చెల్లెళ్లు


ఉయ్యూరులో రాఖీ కడుతున్న అక్క

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	116, 125, 136
చికెన్ విత్ స్కిన్	226
చికెన్ స్కిన్‌లెస్	236



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.4.75

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



మోపిదేవి, ఆగస్టు 19 : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి గుంటూరు జిల్లా చిన్నరావూరు గ్రామానికి చెందిన జిట్టా విజయలక్ష్మి రూ.1,00,001 విరాళంగా అందజేశారు. సోమవారం ఆమె ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. విరాళాన్ని ఆలయ ఉద్యోగులకు అందజేశారు.

నడకుదిటి సేవలు చిరస్మరణీయం



నడకుదిటి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి రవీంద్ర



దివ్యాంగులకు బెరాకా సాయాన్ని అందిస్తున్న రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 19 : మచిలీపట్నం అభివృద్ధిలో మాజీ మంత్రి నడకుదిటి నరసింహారావు సేవలు చిరస్మరణీయమని, ఆయన కాంస్య విగ్రహాన్ని త్వరలో ఏర్పాటు చేస్తామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సోమవారం టీడీపీ కార్యాలయం వద్ద నడకుదిటి నరసింహారావు జయంతి కార్యక్రమం జరిగింది. టీడీపీ, జనసేన నాయకులు నడకుదిటి నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, షిప్పింగ్ యార్డు, కేంద్రీయ విశ్వవిద్యాలయం, భారత్‌సాల్ట్ తీసుకు వచ్చేందుకు నడకుదిటి నరసింహారావు చేసిన కృషి అపారమన్నారు. గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, సిమెంటు రోడ్లు వేశారన్నారు. బలహీన వర్గాల కోసం ఆయన చేసిన కృషి అపారమన్నారు. మత్స్యకారులకు ఆయిల్ సబ్సిడీ ప్రవేశపెట్టిన ఘనత నడకుదిటికే దక్కిందన్నారు. నడకుదిటి నరసింహారావు స్మృతి చిహ్నంగా బందరుకోటలో సొంత నిధులతో మంచినీటి ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, టీడీపీ నాయకులు గోపు సత్యనారాయణ, మోటమర్రి బాబాప్రసాద్, కాగిత వెంకటేశ్వరరావు, పిప్పళ్ళ కాంతారావు, కుంచే నాని, తలారి సోమశేఖర్, జనసేన నాయకుడు గడ్డం రాజు, టీడీపీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి

మచిలీపట్నం టౌన్ : ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఫొటోగ్రాఫర్లు అందిపుచ్చుకోవాలని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా మచిలీపట్నం ఫొటోగ్రాఫర్స్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం జడ్పీ సెంటర్‌లోని డాగురే విగ్రహానికి మంత్రి రవీంద్ర పూలమాలలు వేసి నివాళులర్పించారు. మణిపాల్ ఆసుపత్రి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కాన్సర్ వైద్య పరీక్షల శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. 200 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సీనియర్ ఫొటోగ్రాఫర్లు సత్యనారాయణ, నాగేశ్వరరావులను మంత్రి ఘనంగా సత్కరించారు. సంఘ గౌరవాధ్యక్షుడు లంకిశెట్టి బాలాజీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రవీంద్ర మాట్లాడుతూ, ఫొటోగ్రాఫర్ల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జనసేన నియోజకవర్గం ఇన్‌చార్జి బండి రామకృష్ణ మాట్లాడుతూ, ఫొటోగ్రఫీ వేయి భావాలకు దర్పణం పడుతుందన్నారు. ఫొటోగ్రాఫర్ల సంఘం అధ్యక్షుడు చిలంకుర్తి శేషు నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్టేట్‌బ్యాంకు రీజినల్ మేనేజరు ఎస్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, ఫొటోగ్రాఫర్లకు రుణాలు అందిస్తామన్నారు. సీనియర్ నేత గొర్రెపాటి గోపీచంద్, టీడీపీ నాయకురాలు కొరెడ్ల సుశీల, జనసేన కార్పొరేటర్ పినిశెట్టి ఛాయాదేవి, జనసేన నాయకులు మాదివాడ రాము, పినిశెట్టి వేణు, గడ్డం రాజు, నగరపాలక సంస్థ కమిషనరు బాపిరాజు, సంఘ కార్యదర్శి వి.అనంతకుమార్, కోశాధికారి మట్టా శ్రీరామ్ పాల్గొన్నారు.

బెరాకా సేవలు అభినందనీయం

మచిలీపట్నం టౌన్ : పేద విద్యార్థులను బెరాకా స్వచ్ఛంద సేవా సంస్థ ఆదుకునేందుకు ముందుకు రావడం ముదావహమని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నం టీడీపీ కార్యాలయం వద్ద బెరాకా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో 58 మంది విద్యార్థులు, దివ్యాంగులకు రూ12.33 లక్షల రూపాయల చెక్కులను మంత్రి రవీంద్ర, గుడివాడ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, బెరాకా మినిస్ట్రీస్ అధినేత కిరణ్‌పాల్ అందచేశారు. ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థికి ల్యాప్‌ట్యాప్ అందజేశారు. విద్యుత్ షాక్‌కు గురై కాలు చేయి కోల్పోయిన వ్యక్తికి , ప్రత్యేక అవసరాలు కలిగిన మరో వ్యక్తికి స్వయం ఉపాధికి కావలసిన వస్తువులను అందజేశారు. టీడీపీ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, నడకుదిటి వెంకటేశ్వరరావు, మాజీ కార్పొరేటర్ లోగిశెట్టి వెంకటస్వామి, టౌన్ హాల్ మాజీ ఛైర్మన్ చిన్నం శివ, ఖాజా, బెరాకా మినిస్ట్రీస్ వైస్‌ప్రెసిడెంట్ తిరుమాని వెంకటేశ్వరరావు, ఎస్.ఎన్.వి.ఎస్. ప్రసాద్, కాగిత రమాదేవి, తలారి సోమశేఖర్, ఎండి ఇలియాస్ పాషా, పిప్పళ్ళ కాంతారావు, కుంచే నాని తదితరులు పాల్గొన్నారు.



మంత్రి లోకేశ్‌కు స్వర్ణలత



మంత్రి రవీంద్రకు కొరెడ్ల సుశీల

ప్రముఖుల రక్షా బంధన్

రాఖీ పౌర్ణమి సందర్భంగా రక్షాబంధన్ వేడుకలు ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. సోదరీమణులు సోదరులకు రాఖీలు కట్టి మిఠాయి తినిపించారు. పలువురు ప్రజా ప్రతినిధులకు వారి సోదరీ మణులు, ఆయా పార్టీల మహిళా ప్రతినిధులు, స్నేహితురాళ్లు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.



కాగితకు ఖుర్షీత్ బేగం



కూమార్‌రాజాకు సోదరి అరుణకుమారి

బైక్ ఢీకొని దివ్యాంగుడు మృతి

పమిడిముక్కల : మంటాడ - లంకపల్లి ఆర్ అండ్ బి రోడ్డులో వీరంకిలాకుల వద్ద సోమవారం బైక్ ఢీకొని దివ్యాంగుడు మృతి చెందాడు. పమిడిముక్కల గ్రామానికి చెందిన పులిపాక కుటుంబరావు (38) రోడ్డుపై నడుస్తున్న సమయంలో వెనుక నుంచి వచ్చిన బైక్ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన కుటుంబరావును ప్రాథమిక చికిత్స అనంతరం విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

తోడికోడలిపై కాగిన నూనె పోసిన తమ్ముడి భార్య

కోడూరు : తోడికోడలిపై సలసల కాగే నూనె పోసి దాడి చేసిన సంఘటన కోడూరులో చోటు చేసుకుంది. ఎండూరి స్వామి భార్య రాజ్యలక్ష్మీ కుమారిపై తమ్ముడు ఎండూరి మల్లిఖార్జునరావు భార్య రాజ్యలక్ష్మి సలసల కాగిన నూనె పోసి దాడికి పాల్పడినట్లు తెలిపారు. స్వామి భార్య రాజ్యలక్ష్మి తీవ్రంగా గాయపడి విజయవాడ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. సరిహద్దు గొడవల కారణంగా దాడికి పాల్పడినట్లు బాధితురాలి భర్త ఎండూరి స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పూరిల్లు దగ్ధం

మోపిదేవి : ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని పూరిల్లు దగ్ధమైన ఘటన వెంకటాపురం పంచాయతీ శివారు అన్నవరంలో జరిగింది. పేరుబోయిన నాంచారమ్మ ఇల్లు అగ్నిప్రమాదంలో కావటంతో రూ.6 వేల నగదు, వెండి పట్టీలు, వంట సామగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. వీఆర్వో వరప్రసాద్ సమాచారం మేరకు అవనిగడ్డ అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. నాంచారమ్మ కట్టుబట్టలతో మిగిలారు.

ఊర్మిళ నేత్ర, శరీర దానం




నాగాయలంక : నాగాయలంక ఏడో వార్డుకి చెందిన తలశిల ఊర్మిళ (85) ఆదివారం మృతి చెందారు. మృతురాలి కోరిక మేరకు ఆమె కళ్లను విజయవాడ ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రికి, శరీరాన్ని ఏలూరు ఆశ్రమం మెడికల్ వైద్యశాలకు కుటుంబసభ్యులు తలశిల రాజారావు, ప్రసాద్ అందజేశారు. గ్రామ పెద్దలు సజ్జా గోపాలకృష్ణ, గోపి, తలశిల రాము పాల్గొనగా, సుదర్శి మానవతా సేవా సంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్, కనిగంటి నారాయణ పర్యవేక్షించారు. సంస్థ నుంచి 206వ నేత్రదానం, ఎనిమిదో శరీర దానమని నిర్వాహకులు తెలిపారు.

శతాధిక వృద్ధురాలి మృతి

పెడన : ఉప్పలకలవగుంట గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు రాజులపాటి చిట్టెమ్మ (103) సోమవారం కన్నుమూశారు. చనిపోయేనాటి వరకు చిట్టెమ్మ తన పనులు తాను చేసుకునేవారని కుటుంబ సభ్యులు తెలిపారు. గతంలో చిట్టెమ్మ తల్లి మట్టా శాయమ్మ కూడా 100 సంవత్సరాలకు పైగా జీవించారు.

పార్వతీదేవికి గాజుల అలంకారం



మోపిదేవి : టేకుపల్లిలో కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో నడుస్తున్న బాలపార్వతీ సమేత రామేశ్వరస్వామి ఆలయంలో శత సహస్ర గాజుల అలంకరణ మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు లంకా ప్రసాద్, అర్చకులు పిల్లల మర్రి శాస్త్రి ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజ లు నిర్వహించారు. అమ్మవార్లను కుంకుమార్చన నిర్వహించారు. కమిటీ సభ్యులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు.

చల్లపల్లి సీఐగా ఈశ్వరరావు



చల్లపల్లి : చల్లపల్లి సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా కె.ఈశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం ఇంటెలిజెన్స్ సీఐగా పనిచేస్తూ ఆయన బదిలీపై చల్లపల్లి వచ్చారు. చల్లపల్లిలో పని చేసిన నాగప్రసాద్ గుడివాడ సీఐగా వెళ్లారు.

ఆక్రమణలోని 14.32 ఎకరాల చెరువులు స్వాధీనం చేసుకోవాలని వినతి

పమిడిముక్కల : గోపువానిపాలెం వద్ద రైతుల ఆక్రమణలో ఉన్న 14.32 ఎకరాల చెరువులు స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్‌కు మీకోసంలో ఫిర్యాదు చేసినట్టు సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.

సర్వే నంబరు 30లో 9.88 ఎకరాలు వల్లభుడు చెరువు, సర్వే నంబరు 93లో 4.44 ఎకరాలు పట్టాభిరాముడు చెరువులు రైతుల ఆక్రమణలో ఉన్నాయన్నారు. పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వుల మేరకు 14.32 ఎకరాల చెరువులు స్వాధీనానికి జిల్లా పంచాయతీ అధికారి చర్యలు తీసుకునేలా చూడాలని కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదు చేసినట్లు శ్రీనివాసగౌడ్ పేర్కొన్నారు.



వక్కలగడ్డలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా సమాఖ్య నాయకులు



కోట రాఘవయ్య విద్యాసంస్థల విద్యార్థుల కొవ్వొత్తుల ర్యాలీ

హత్యాచార నిందితులకు మరణ శిక్ష విధించాలి

● మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి రత్నకుమారి డిమాండ్ ● వక్కలగడ్డ, కోడూరులో కొవ్వొత్తుల ర్యాలీ

చల్లపల్లి, ఆగస్టు 19 : కోల్‌కతాలో డాక్టర్ హత్యాచార నిందితులకు మరణశిక్ష విధించాలని మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మల్లుపెద్ది రత్నకుమారి డిమాండ్ చేశారు. హత్యాచార ఘటనను ఖండిస్తూ వక్కలగడ్డలోని కమలానెహ్రూ మహిళా మండలి ఆధ్వర్యంలో సోమవారం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. రత్నకుమారి మాట్లాడుతూ, వైద్యం జరిగే ప్రదేశంలో మహిళలకు రక్షణ కల్పిస్తూ 2022లో తీసుకువచ్చిన బిల్లు అమలులోకి రాలేదన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తక్షణం కేంద్ర ప్రభుత్వం రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ మాట్లాడుతూ, మహిళా ముఖ్యమంత్రి నాయకత్వం వహిస్తున్న పశ్చిమ బెంగాల్లో మహిళపై ఘోరం జరిగితే నిందితులపై ఇప్పటి వరకూ చర్యలు తీసుకోకపోవటం బాధాకరమన్నారు. సర్పంచ్ వల్లూరు ఉమా, మహిళా సమాఖ్య నాయకులు అట్లూరి స్వరూప, ఘైనేని కమల, వెల్లంకి శ్రీదేవి, కుర్రా అరుణ, వెలివెల మాధవి, దాసరి సుభద్రాదేవి, వాణి, లక్ష్మి, రైతు సంఘం నేత అట్లూరి వెంకటేశ్వరరావు, మల్లుపెద్ది బోసు తదితరులు పాల్గొన్నారు. **కోడూరు :** కోల్‌కతా హత్యాచార ఘటనను ఖండిస్తూ కోడూరులోనికోట రాఘవయ్య, రవితేజ స్కూల్ ఆధ్వర్యంలో ప్లకార్డులు, కొవ్వొత్తులతో భారీ ర్యాలీ నిర్వహించారు.. కోట రాఘవయ్య విద్యాసంస్థల గౌరవ సలహాదారు కోట వెంకట సుబ్బారావు మాట్లాడుతూ మహిళలపై లైంగిక వేధింపులు, హత్యలు నివారించటానికి మన దేశంలో మరింత బలమైన చట్టాలు తక్షణమే తీసుకురావాలన్నారు. రవితేజ స్కూల్ డైరెక్టర్ వల్లభనేని వరప్రసాద్, ప్రిన్సిపాల్ కొరివి అనిల్ కుమార్, జూనియర్ కళాశాల కరస్పాండెంట్ కాగితాల జగన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కారకంపాడులో శ్రీముఖ లింగేశ్వరస్వామి ఆలయానికి శంకుస్థాపన



కూచిపూడి : మొవ్వ మండలం కారకంపాడు లో శ్రీ బాలాత్రిపుర సుందరిదేవి సమేత శ్రీముఖ లింగేశ్వరస్వామి ఆలయ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి సతీసమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ రొండి కృష్ణ యాదవ్, గ్రామసర్పంచ్ నాగనబోయిన సునీల్, లింగమనేని రామలింగేశ్వరరావు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అధికారుల అలసత్వం రైతులకు శాపం



వల్లూరుపాలెంలో కుళ్లిన వరి నాట్లు

తోట్లవల్లూరు, ఆగస్టు 19 : అధికారుల అలసత్వం రైతులకు శాపంగా మారింది. వల్లూరుపాలెంలో ఏనుగులకోడు డ్రెయిన్ కింద సుమారు వంద ఎకరాల్లో వరినాట్లు కుళ్లిపోయాయి. పది రోజుల క్రితం భారీ వర్షాలకు వల్లూరుపాలెం వద్ద వరి నాట్లు ముంపునకు గురయ్యాయి. రూ.14 లక్షలతో ఏనుగులకోడు డ్రెయిన్‌లో చేపట్టిన గుర్రపుడెక్క తొలగింపు పనులను అసంపూర్తిగా వదిలేయటంతో వరి నాట్లు ముంపునకు గురై ఈ పరిస్థితి దాపురించిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రెండుసార్లు వేసిన వరినాట్లు దెబ్బతిన్నాయని, ఇక చేసేదేమి లేక అలాగే వదిలేశామని రైతులు వాపోయారు. వరినాట్లు దెబ్బతిన్న తరువాత అధికారులు గుర్రపుడెక్క చనిపోయేందుకు మందులను స్ప్రే చేశారు. రైతులకు జరిగిన నష్టం ఎవ్వరు పూడ్చలేనిది. అధికారులు ముందస్తు చర్యలు చేపడితే ఇలాంటి నష్టాలను నివారించేందుకు వీలుంటుందని రైతులు కోరుతున్నారు.

రసాయన రహిత వ్యవసాయం అవశ్యం



పెదకళ్లేపల్లిలో పొలంబడిలో పాల్గొన్న రైతులు, ఏవో హెబ్సిబా రాణి

మోపిదేవి : మారుతున్న శాస్త్ర సాంకేతిక విధానాలకు అనుగుణంగా వ్యవసాయ రంగంలోనూ రసాయన రహిత విధానాలపై రైతులు ఆసక్తి చూపాలని మండల వ్యవసాయ శాఖాధికారిణి హెబ్సిబా రాణి అన్నారు. పెదకళ్లేపల్లిలో పొలంబడి నిర్వహించారు. పొలాలను రైతులతో కలిసి వ్యవసాయ సిబ్బంది పరిశీలించారు. రైతులు అధిక మోతాదులో రసాయనిక ఎరువులు వినియోగించటం వల్ల పెట్టుబడి ఎక్కువ కావటంతో పాటు పర్యావరణ కాలుష్యం కూడా పెరుగుతుందన్నారు. రసాయన రహిత విధానాలపై ఆసక్తి చూపితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలు ఎక్కువగా ఇస్తున్నాయన్నారు. సాగు చేసిన పంటను రైతులు ఇ-క్రాప్ నమోదు చేసుకోవాల్సిందిగా ఆమె సూచించారు.

గూడూరు వైసీపీ వార్డు మెంబర్లు టీడీపీలో చేరిక



పెడన : గూడూరు గ్రామ పంచాయతీ వార్డు మెంబర్లు వైసీపీకి గు డ్‌బై చెప్పి టీడీపీలో చేరారు. వార్డు మెంబర్లు అమరావరపు వెంకట సుబ్బారావు, శాఖల శ్రీహరి, దేవనబోయిన వెంకటరమణ, కొత్తగుండు నాగవెంకటలక్ష్మి మండల టీడీపీ నాయకుల సమక్షంలో సోమ వారం టీడీపీలో చేరారు. పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పోతన స్వామి, ఎన్ఏ బేగ్, గొరిపర్తి ఫణిరాజు, డొక్కు నాగరాజు, బేతాళ స్వామి, యారా ప్రసాద్ పాల్గొన్నారు.

వీఆర్వో శ్రీనివాసరావుకు సత్కారం



పమిడిముక్కల : విధినిర్వహణలో విశిష్ట సేవలందించి ప్రజలు, ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకోవడం అభినందనీయమని తహసీల్దార్ కె. నవీన్‌కుమార్ అన్నారు. ఉత్తమ వీఆర్వోగా కలెక్టరు నుంచి ప్రశంసాపత్రం అందుకున్న హనుమంతపురం వీఆర్వో పీవీవీ శ్రీనివాసరావును తహసీల్దార్ ఆధ్వర్యంలో రెవెన్యూ ఉద్యోగులు సోమవారం దుశ్శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. మండల సర్వేయర్ మణికుమార్, వీఆర్వోల సంఘం అధ్యక్షుడు కె.ప్రసాద్, ఉద్యోగులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో సమస్యలు పరిష్కరించాలి

గుడివాడ రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని ఎంపీపీ గద్దె పుష్పరాణి అన్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సోమవారం ఆమె మాట్లాడారు. మౌలిక వసతుల కల్పన, తాగునీరు, పారిశుధ్యం, వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. జడ్పీటీసీ సభ్యుడు గోళ్ల రామకృష్ణ మాట్లాడుతూ తాగునీటికి అత్యంత ప్రాముఖ్యతనివ్వాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగే విధంగా సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. ఎంపీడీవో ఏ.వెంకటరమణ, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ రాంబాబు, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణం చేపట్టాలని వినతి

అవనిగడ్డ రూరల్ : కోటగిరి లంకలో రహదారి నిర్మాణానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రజలు ఎంపీడీవో మరియ కుమారికి వినతిపత్రం సమర్పించారు. ఆర్‌సీఎం చర్చి నుంచి తారురోడ్డు నిర్మాణానికి మండల పరిషత్ అధికారులు లక్ష రూపాయల నిధులు మంజూరు చేశారని, సదరు కాంట్రాక్టర్ ఎన్నికల సందర్భంగా పనులు నిలిపివేశారన్నారు. గోపాలం మాస్టారు, డి.విజయకుమారి, జె.రమేష్, అరుణ, చాతుర్య తదితరులు వినతిపత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో బీమా రంగానికి మొండి చేయి

మచిలీపట్నం టౌన్ : కేంద్ర బడ్జెట్‌లో బీమా రంగానికి మొండి చేయి చూపారని సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఉద్యోగుల ఫెడరేషన్ సంయుక్త కార్యదర్శి, మచిలీపట్నం డివిజన్ ఎల్ఐసీ ఉద్యోగుల సంఘ ప్రధాన కార్యదర్శి కిషోర్‌కుమార్ అన్నారు. ఎల్ఐసీ కార్యాలయం హాలులో కేంద్ర బడ్జెట్‌పై జరిగిన సదస్సులో కిషోర్‌కుమార్ మాట్లాడుతూ, బీమా రంగ వృద్ధికి ఏ విధమైన పన్ను రాయితీలు, ప్రోత్సాహకాలు ఇవ్వలేదన్నారు. ప్రీమియంపై జీఎస్టీ మినహాయించాలని కోరినప్పటికీ పట్టించుకోలేదన్నారు. సంఘ నాయకులు జె. సుధాకర్, టి. చంద్రపాల్, ఎల్. రాజశేఖర్, వై. స్వామినాథ్, డి. మాధుర్, డి. వాసు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బీమా ఎంతో ప్రయోజనకరం

గుడివాడ : ఎంతో ప్రయోజనకరమైన పోస్టాఫీస్ పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని గుడివాడ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ చల్లా అప్పారావు తెలిపారు. పోస్టల్ బీమా తీసుకున్న లబ్ధిదారుడు షణ్ముఖ గుప్తాకు అంగవైకల్యం కలగడంతో పరిహారంగా రూ.6,50, 000 చెక్కును అందించారు. బ్యాంకు సీనియర్ మేనేజర్ పి.గణేష్, మేనేజర్ పి.కిషోర్, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

వసుధ తీయనిబంధంపై సమీక్ష



గుడివాడ : ఉద్యోగం, కవిత్వంతో వసుధ బసవేశ్వరరావు కు తీయని బంధం ఉందని డైట్ విశ్రాంత ప్రిన్సిపాల్ ఎం. వి.అంజనేయులు అన్నా రు. వసుధ రచించిన తీయన బం ధం గ్రంథంపై భారతీ సమితి ఆధ్వర్యంలో రచయితలు సమీక్ష నిర్వహించారు. శతాధిక శతకకర్త చంద్రం, నవ్వుల పొదరిల్లు ఎం.ఎస్ బాబు, నాటక కళాకారులు పి.వి సత్యనారాయణ, మల్లిక్, నాగేశ్వరరావు, నూలు సాంబశివరావు, కవులు మాల్యాద్రి, పీటర్, సురేంద్ర, చింతా రామచంద్ర, విశ్రాంత గ్రంథాలయాధి ఆనంద్‌మోహన్, అవిర్నేని వెంకటేశ్వరరావు, కొమ్ము వెంకటేశ్వర్లు, కృష్ణకిషోర్, నాగేశ్వరరావు, రాజారావు, ప్రసాద్, పి.ఎం.ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

భారత్ బంద్ జయప్రదం చేయండి : దారం

గుడివాడ : ఎస్సీ వర్గీకరణ తీర్పును పునఃసమీక్షించాలని కోరుతూ దళిత సంఘాల పిలుపు మేరకు ఈనెల 21వ తేదీన చేపట్టిన భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ దారం ఉపేంద్ర, అధ్యక్ష, కార్యదర్శులు కర్రా గాబ్రియేల్, చింతా నాని కోరారు. పి.జయరాజు, డి.కరుణాకర్, జి.శ్రీకాంత్, బుంగా జాన్, కె.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.